క్లుప్తంగా

చెరువులు నింపాలి

కేతేపల్లి: ఏఎమ్మార్పీ కాల్వల ద్వారా చెరువులు, కుంటలు నింపి తాగు, సాగునీటి ఇబ్బందులు తొలగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు అధికారులను కోరారు. బుధవారం కేతేపల్లిలో నిర్వహించిన సీపీఎం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, ఎల్.రాజు, అశోక్‌రెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

రేషన్ దందా చేస్తే పీడీ యాక్ట్

మర్రిగూడ : రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ బియ్యం అక్రమ రవాణా అరికట్టేందుకు రైస్ మిల్లులను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు.

దివ్యాంగుడికి చేయూత



సరుకులు, నగదు అందజేస్తున్న లిటిల్ సోల్జర్స్ ప్రతినిధి వినయ్

నకిరేకల్ : వరంగల్ జిల్లా భీమదేవరపల్లి మండలం రత్నగిరికి చెందిన దివ్యాంగుడు అజయ్ తల్లితండ్రులు ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అజయ్‌కి నకిరేకల్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధి వినయ్ బుధవారం క్వింటా బియ్యం, మూడు మాసాలకు సరిపడా నిత్యావసర సరకులు, రూ.5వేలు నగదును ఫౌండేషన్ తరఫున వారి తాత వీరయ్యకు అందజేశారు.

మోటార్ స్టార్టర్లు దహనం

తిప్పర్తి : మండల కేంద్రంలోని డీ–40 కాలువ వెంట రైతుల మోటార్ స్టార్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. బాధితులు పోలగోని రాములు, మామిళ్ల సైదులు మాట్లాడుతూ మోటార్ స్టార్టర్‌ను దహనం చేసిన వారిని శిక్షించి తమకు న్యాయం చేయాలని కోరారు.

లయన్స్ క్లబ్ ఏర్పాటు

మునుగోడు: మండల కేంద్రంలో నూతనంగా లయన్స్ క్లబ్‌ను బుధవారం ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా నారబోయిన రవిముదిరాజ్, కార్యదర్శిగా పాలకూరి నర్సింహగౌడ్, కోశాధికారిగా మిర్యాల వెంకటేశం ప్రమాణ స్వీకారం చేశారు.

గద్దర్ సేవలు మరువలేనివి

మునుగోడు: బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కోసం తన జీవిత కాలం పాటల ద్వారా ప్రభుత్వాలను ప్రశ్నించిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ సేవలు మరువలేనివని కళాకారులు కొనియాడారు. తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం మునుగోడులో గద్దర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. మాలిగ యాదయ్య, వనం లింగయ్య, రడం నర్సింగ్‌రావు, పందుల సైదులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

మర్రిగూడ : బ్యాంక్‌లో తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శివన్నగూడెం బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ డి.రిషికేష్ అన్నారు. బుధవారం కొట్టాలలో రైతులతో ఆయన మాట్లాడారు. క్రాప్ లోన్ తీసుకున్న రైతులు సంవత్సరం లోపు అసలు, వడ్డీ చెల్లించినట్లయితే వడ్డీ రాయితీ పొందవచ్చని తెలిపారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

మునుగోడు: వ్యవసాయ పనిముట్లతోపాటు ఇతర పనిముట్లను సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్(ఎస్ఎంఏఎం) పథకంలో భాగంగా రైతులకు సబ్సిడీపై అందించనున్నట్లు నిమండల వ్యవసాయ అధికారి పద్మజ బుధవారం తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు, భూమి పట్టా పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంట్, ట్రాక్టర్ ఆర్‌సీ జతచేసి స్థానిక ఏఓ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలతోపాటు మహిళా రైతులకు 50 శాతం రాయితీ, ఇతర రైతులకు 40 శాతం రాయితీ అందించనున్నట్లు తెలిపారు.

చండూరు : వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద చండూరు మండలానికి 355 యూనిట్లు మంజూరైనట్లు వ్యవసాయాధికారి చంద్రిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో 275 బ్యాటరీ స్ప్రేయర్లు, 35 తైవాన్ స్ప్రేయర్లు, 16 రోటవేటర్లు, ఇతర పనిముట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

రజతోత్సవ సభలకు వెళ్లిన యూటీఎఫ్ నాయకులు

నల్లగొండ : కొల్‌కతాలో ఈ నెల 8 నుంచి మూడు రోజుల పాటు జరిగే 9 వ ఎస్‌టీఎఫ్ఐ (స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) రజతోత్సవ మహాసభలకు ఉమ్మడి జిల్లా నుంచి టీఎస్ యూటీఎఫ్ నాయకులు నలుగురు ఎంపికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమళ్ళ వెంకటేశం, సూర్యాపేట నుంచి యాకయ్య సభలకు వెళ్లారు.

సైకిల్ షెడ్డే ప్రాథమిక పాఠశాల



దాత సహకారంతో తరగతి గదిగా మార్చిన సైకిల్ షెడ్డు



చెట్ల కింద నిర్వహిస్తున్న తరగతులు

- దాత సహకారంతో షెడ్డుకు గోడల నిర్మాణం
- సరిపడా గదులు లేకపోవడంతో చెట్ల కిందే విద్యార్థులకు పాఠాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చండూరు : పేరుకే పాఠశాల.. కానీ అక్కడ విద్యార్థులకు ఎటువంటి సౌకర్యాలు లేవు. చండూరు పట్టణ నడిబొడ్డున ఉన్నా కానీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది చండూరు పట్టణ ప్రాథమిక పాఠశాల(చిన్న బడి). ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉన్న ఆ పాఠశాలలో ప్రస్తుతం దాదాపు 100 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలకు 3 తరగతి గదులు, ఒకే ఒక్క టాయిలెట్ ఉన్నాయి.

డిగ్రీ కళాశాల మంజూరు కావడంతో..

15 సంవత్సరాల క్రితం చండూరుకు డిగ్రీ కళాశాల మంజూరైంది. అయితే సరిపడా భవనం ఎక్కడా లేకపోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఊరికి దూరంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలనుకున్నారు. ఈ క్రమంలో ప్రాథమిక పాఠశాలను ఊరి మధ్యలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలోకి మార్చారు. అప్పటికే జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవు. దీంతో ప్రాథమిక పాఠశాలను జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన సైకిల్ షెడ్‌లో నిర్వహించాలని నిర్ణయించారు.

15 సంవత్సరాలుగా..

పైకప్పుకు రేకులు తప్ప చుట్టూ గోడలు కూడా లేని సైకిల్ షెడ్డుకు చండూరుకు చెందిన దాత మంచుకొండ చిన్న భిక్షమయ్య సుమారు రూ.2 లక్షలు ఖర్చుచేసి గోడలు కట్టించారు. పాఠశాలకు రంగులు, విద్యార్థులకు బెంచీలు సమకూర్చారు. దాదాపు 100 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలో సరిపడా తరగతి గదులు లేవు. దీంతో రెండు తరగతుల విద్యార్థులకు చెట్ల కిందే పాఠాలు బోధిస్తున్నారు. దాదాపు 15 సంవత్సరాలుగా ఇదే పరిస్థితి ఉన్నా ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. పక్కన ఇల్లు ఉండడంతో పైకప్పు లేని టాయిలెట్‌ను విద్యార్థినులు వినియోగించలేకపోతున్నారు. ఉపాధ్యాయుల కోసం ఉన్న ఒక్క టాయిలెట్‌నే దాదాపు 55 మంది విద్యార్థినులు, ఉపాధ్యాయులు వినియోగించుకుంటున్నారు. 15 సంవత్సరాలుగా అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు అధికారులకు ప్రజాప్రతినిధులకు పాఠశాల పరిస్థితిని వివరించినా ఎవరూ పట్టించుకోలేదు.

కలెక్టర్ ఆదేశించినా..

చండూరు పట్టణంలోని భవిత కేంద్రాన్ని ఇటీవల తనిఖీ చేయడానికి వచ్చిన కలెక్టర్ ఇలా త్రిపాఠిని ప్రధానోపాధ్యాయుడు యాదగిరి కలిసి ప్రాథమిక పాఠశాల పరిస్థితిని వివరించారు. దీంతో సమగ్ర నివేదిక ఇవ్వాలని చండూరు తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. అయితే తహసీల్దార్ కిరణ్మయి కూడా బదిలీపై వెళ్లడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. చండూరు ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం మంజూరు చేసి విద్యార్థుల, ఉపాధ్యాయుల కష్టాలు తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు

పాఠశాలకు సరిపడా గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో వేదికలపై పాఠశాల గురించి ప్రజాప్రతినిధులకు అధికారులకు చెబుతూనే ఉన్నాం. దాత సహాయంతో ఎంతో కొంత సౌకర్యాలు సమకూర్చాం.

– పిల్లి యాదగిరి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నల్లగొండ : సమావేశంలో మాట్లాడుతున్న సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ

నల్లగొండ : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. సైబర్ జాగరుకత దివస్ సందర్భంగా అడిషనల్ ఎస్పీ రమేష్‌తో కలిసి బుధవారం నల్లగొండ పట్టణంలోని పోలీస్ ఆడిటోరియంలో ప్రగతి కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ వారు తక్షణమే స్పందిస్తారని తెలిపారు తద్వారా పోయిన డబ్బులు రికవరీ చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి సైబర్ క్రైం ఎస్ఐ విష్ణు, టూటౌన్ ఎస్ఐ సైదులు, సైబర్ క్రైం హెడ్‌కానిస్టేబుల్ రియాజ్, కానిస్టేబల్ మొక్షిత్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కట్టంగూర్ ఎస్ఐ మునుగోటి రవీందర్ అన్నారు. బుధవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని సాందీపని ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. గుర్తు తెలియన వ్యక్తుల నుంచి ఫోన్ వస్తే వెంటనే కట్ చేయాలని సూచించారు. ఫోన్‌కు వచ్చిన లింక్‌లను ఓపెన్ చేసి మోసపోవద్దన్నారు. కొత్తవారు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బి వెంకన్న, సతీష్, దుర్గాప్రసాద్, శ్రీను, శంకర్, హెచ్ఎం రాములు ఉన్నారు.

తిప్పర్తి : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ క్రైంపై తిప్పర్తి ఎస్ఐ శంకర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చండూరులో..

చండూరు : యువత, ప్రజలు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని చండూరు ఎస్ఐ నర్సింగ్ వెంకన్నగౌడ్ సూచించారు. బుధవారం చండూరు పట్టణంలోని డాన్‌బాస్కో జూనియర్ కళాశాలలో జరిగిన సైబర్ జాగృతి దివస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండల కేంద్రంలోని గీతాంజలి ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ నివారణపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది, పాఠశాల కరస్పాండెంట్ దొంతూరి పరమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కామారెడ్డి డిక్లరేషన్‌పై మాటతప్పిన కాంగ్రెస్'

నల్లగొండ టూటౌన్ : కామారెడ్డి డిక్లరేషన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. , బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి ముస్లింలను చేర్చిన కాంగ్రెస్.. బీసీలను మోసం చేసిందన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ధర్నాకు బీసీల మద్దతు కరువైందని, ముస్లింల రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా చేసిందని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్లలో ముస్లింలకు 10 శాతం పోతే బీసీలకు 32 శాతమే ఉంటుందన్నారు. ముస్లింల రిజర్వేషన్లు తొలగించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటే బీజేపీ మద్దతు ఇస్తుందని తెలిపారు.

యూజీడీ, సీసీ రోడ్లు పూర్తి చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణం ముషంపల్లి రోడ్డులోని ఏఆర్ నగర్, శాంతినగర్ శివారు ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతూ బీజేపీ నాయకులు బుధవారం ప్రజారోగ్యశాఖ ఎస్ఈ కందకూరి వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. అమృత్ స్కీం కింద మంజూరైన జాబితాలో ఆయా కాలనీలు లేవని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో మాజీ కౌన్సిలర్ నూకల వెంకట్‌నారాయణరెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గడ్డం మహేష్, గుండగోని శ్రీనివాస్, గాలి దేవేందర్, ఎన్నమల్ల మహేష్, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, సాయి తదితరులు ఉన్నారు.

వైభవంగా మహా పూర్ణాహుతి వేడుకలు



హోమంలో పాల్గొన్న భక్తులు

కట్టంగూర్ : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పూజారి రామడుగు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో బుధవారం మహా పూర్ణాహుతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణస్వామి విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు, హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రామడుగు శశిరేఖ, కొత్త శోభ, కొంపెల్లి మంగమ్మ, కడవేరు కృష్ణవేణి, గుడపాటి పద్మ, మిట్టపల్లి స్వాతి, ఇల్లెందుల మణెమ్మ, రెడ్డిపల్లి మనోహర్, ఓరుగంటి రమేష్, ఇల్లెందుల గోపి, బండారు అరుణ్, రెడ్డిపల్లి సైదులు, తప్పి నవీన్, రాపోలు విజయ్, కాపుగొంటి గోపి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ముందస్తు అరెస్ట్



కట్టంగూర్ : పోలీసుల అదుపులో మధ్యాహ్న భోజన కార్మికులు

కట్టంగూర్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం చలో హైదరాబాదుకు వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో కార్మికులు మాచర్ల యాదమ్మ, కంకణాల శోభారాణి, కొప్పు మంగమ్మ ఉన్నారు. కార్మికుల అరెస్టును సీఐటీయూ నాయకులు పెంజర్ల సైదులు ఖండించారు.

నార్కట్‌పల్లి : హైదరాబాద్ విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు వెళ్లకుండా మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులను బుధవారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయినవారిలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి బయన్న, చింత సంగీత, అండాలు, అరుణజ్యోతి, దండు లక్ష్మమ్మ, మేడి లక్ష్మమ్మ, కలపెల్లి కలమ్మ, వసంత, తదితరులు ఉన్నారు.

మర్రిగూడ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, సల్వోజు రామలింగచారిలను మర్రిగూడ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని పోలీసులు సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన పంతంగి రామచంద్రయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఆయన వైద్య చికిత్స ఖర్చులకుగాను మంజూరైన రూ.17,500 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు చెరుకు సైదులు, మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి, పట్ల జనార్దన్, జనపాల శ్రీను, మర్రి రమేష్, కురుపటి లింగయ్య, పాకాల దినేష్, ఉయ్యాల నరేష్ పాల్గొన్నారు.

ఈ-పంచాయతీ ఆపరేటర్ కేటాయింపు

సాక్షి ఎఫెక్ట్..

గట్టుప్పల్ : గట్టుప్పల్ మండల పరిషత్ కార్యాలయంలో ఈ పంచాయతీ ఆపరేటర్ లేక పౌర సేవలకు ప్రజలు దూరమయ్యారు. ఆయా గ్రామాల ప్రజలు పాత మండలాల్లో సేవలు పొందుతున్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల సాక్షి దినపత్రికలో సక్రమంగా అందని పౌర సేవలు అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య.. చండూరు మండల పరిషత్ నుంచి నజీర్‌ను గట్టుప్పల్ మండలానికి కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఒకటి రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నట్లు ఎంపీడీఓ మాధవరెడ్డి తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

కట్టంగూర్ : విశ్వకర్మ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని విశ్వకర్మ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాయబండ పాండురంగాచారి పిలుపునిచ్చారు. బుధవారం కట్టంగూర్ మండల కేంద్రంలో విశ్వకర్మ సంఘం మండల నాయకులతో కలిసి పాదయాత్ర కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జేఏసీ మండల చైర్మన్ విశ్వనాథుల జానాచారి, చిలకమర్రి పోతులూరిచారి పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలని వినతి

మునుగోడు: మంచి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఊకొండి గ్రామ ప్రజలు బుధవారం ఎంపీడీఓ ఈ. విజయభాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఐదు నెలలుగా గ్రామ ప్రజలకు సరిపడా నీరు సరఫరా కావడం లేదని, మిషన్ భగీరథ నీరు కూడా అంతంత మాత్రంగానే సరఫరా అవుతోందని వివరించారు. వినతి పత్రం అందజేసినవారిలో పోలగోని సైదులు గౌడ్, బి.రవి, డి.రవి, నవీన్, నాగరాజు ఉన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



నల్లగొండ : జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అడిషనల్ ఎస్పీ రమేష్



నల్లగొండ టూటౌన్ : జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



నకిరేకల్ : జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

నల్లగొండ : జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీఆర్బీ డీఎస్పీ రవి, ఏఆర్ ఎస్ఐ చిన్నబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని బీఆర్ఎస్ నాయకులు బుధవారం నల్లగొండ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి.వెంకటేశ్వర్లు, చీర పంకజ్‌యాదవ్, అభిమన్యు శ్రీనివాస్, కరీంపాషా, రావుల శ్రీనివాస్‌రెడ్డి, మారగోని గణేశ్, కొండూరు సత్యనారాయణ, కంచనపల్లి రవీందర్‌రావు, సింగం రామ్మోహన్; లొడంగి గోవర్ధన్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్‌ఖాన్, కార్యదర్శి బి.బాలమ్మ, యాదగిరిరెడ్డి, అలెగ్జాండర్, ఫైజ్ మొహమ్మద్ ఖాన్, పగడాల నాగేందర్, పున్న అంజయ్య, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజీయూలో..

నల్లగొండ టూటౌన్ : ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ అలువాల రవి, ప్రొఫెసర్లు కొప్పుల అంజిరెడ్డి, ఆకుల రవి, రేఖ, డాక్టర్ రూప, మారం వెంకటరమణారెడ్డి, లక్ష్మీప్రభ, రమావత్ మురళి, నరసింహ, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

కనగల్: మండల పరిధిలోని చినమాదారం ఉన్నత పాఠశాలలో జయశంకర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు, కనగల్ మండల విద్యాధికారి వల్లపట్ల పద్మ, రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నకిరేకల్ : ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను నకిరేకల్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అబ్దుల్ రషీద్, ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పన్నాల రాఘవరెడ్డి, కౌన్సిలర్ యాసారపు లక్ష్మీ వెంకన్న, సాకుంట్ల నర్సింహ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తాటికల్ జెడ్పీ హైస్కూల్‌లో జయశంకర్ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం ప్రజ్ఞాపూర్ వెంకన్న, ఉపాధ్యాయులు పండుగ తిరుమలయ్య, మార్త రాములు, సాగర్ల సత్తయ్య, నర్రా వెంకట్‌రెడ్డి, లొట్లపల్లి కోటయ్య, నూకల జానయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రోగాం ఇన్‌చార్జ్ కె.హరిత, అధ్యాపకులు శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, శంకర్, నర్సింహాచారి, శివశంకర్, ఉపేందర్, రవీందర్, సుభాషిణి, సిబ్బంది వెంకన్న, సుదర్శన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని వనిపాకల జెడ్పీహెచ్ఎస్‌లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాణాల శ్రీనయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దంతూరి సైదులుగౌడ్, గంపల రవీందర్‌రెడ్డి, సీహెచ్.నర్సింహాచారి, కవిత, నజీరున్నీసాబేగం, విజయ, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కట్టంగూర్ : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను కట్టంగూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి ఆర్ఐ కుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రియదర్శిని, జూనియర్ అసిస్టెంట్ ఎస్.భాగ్యలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది ఎస్ ఊర్మిళ, సంతోష, రవి, రఘు, అరవింద్, వీఆర్ఏలు రాజు, మల్లికార్జున్, సైదమ్మ, లతీఫ్ ఉన్నారు.

నార్కట్‌పల్లి : జయశంకర్ జయంతిని బుధవారం నార్కట్‌పల్లి మండలంలోని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ ఉమేష్, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ యాదగిరి, జాగృతి నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీజీ లింగం, సర్వేయర్ శ్రీనివాస్, ఆర్ఐలు తరుణ్, భవాని, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను కేతేపల్లి మండలంలోని భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.భిక్షమయ్య, ఉపాధ్యాయులు రాపోలు పరమేష్, బత్తుల జానకిరెడ్డి, జి.రమేష్, గుండా వెంకటేశ్వర్లు, కన్నె శివయ్య, ఎల్.శ్రీధర్, మేడం శేఖర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



గట్టుప్పల్ మండల పరిషత్ కార్యాలయంలో..

శాలిగౌరారం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, ఏపీఓ జంగమ్మ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చండూరు : ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని బుధవారం చండూరులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చండూరు పట్టణంలో జయశంకర్ విగ్రహానికి చండూరు మాజీ ఎంపీపీ తోకల వెంకన్న పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్, అధికార ప్రతినిధి బొడ్డు సతీష్, మాజీ కౌన్సిలర్ కోడి వెంకన్న, పెదగోని వెంకన్న, కురుపాటి సుదర్శన్, సైదులు, దశరథ, రామకృష్ణ, సత్తయ్య, గిరి, స్వామి, వెకన్న, నవీన్, లింగస్వామి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీఓ జి.చినమునయ్య, డిప్యూటీ తహసీల్దార్ నిర్మలాదేవి, సూపరింటెండెంట్ యాకుబ్, ఆర్ఐలు పాండురంగారెడ్డి, జహీరొద్దీన్, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనునాయక్, పార్వతి పాల్గొన్నారు.

గట్టుప్పల్ : జయశంకర్ జయంతిని గట్టుప్పల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి ఎంపీడీఓ మాధవరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ తాటి శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ శశిధర్, రికార్డు అసిస్టెంట్ నర్సింహ, కార్యదర్శులు పాల్గొన్నారు.



చిట్యాల: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



చండూరు : పూలమాల వేస్తున్న తోకల వెంకన్న



కట్టంగూర్ : నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

చిన్నారులకు అన్నప్రాసన

మర్రిగూడ : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు బుధవారం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాపోలు విజయశ్రీ, చిట్యాల సువర్ణరెడ్డి, పెరుమాళ్ల అనసూర్య, వైద్యుడు శ్రీనివాస్, ఆయా యాదమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



శివన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేయిస్తున్న సిబ్బంది